అద్దెకున్నవాళ్ల
బాధపడలేక
అతను ఇంటిని
ఎందుకు
అమ్మకానికి పెట్టాడు?

పెనుమాక
నాగేశ్వరరావు
కథ

# సొంతగూడు

వెంకట్రావ్ ఇల్లు అమ్మేస్తున్నాడనే వార్త ఇరుగుపొరుగు దగ్గర్నుంచి ఇంగ్లండ్‌లో వుంటున్న అతని బావమరిది వరకూ ప్రచారం అయింది.

ఆత్మీయులంతా ఆ వార్త విని కలవరపడ్డారు. అయిన వాళ్ళందరూ ఇల్లు అమ్మవద్దని హితబోధ చేశారు వెంకట్రావుకు.

స్నేహితులు బంధువులు శ్రేయోభిలాషులు అందరూ ఒక్కటే సలహా ఇల్లు అమ్మవద్దు అని.

"అమ్మక తప్పదు" అన్నాడు వెంకట్రావ్. తనకు ఉన్న అప్పులు అగచాట్లు ఏకరవు పెట్టాడు.

"సెంటర్లో ఇల్లు అమ్మితే తిరిగి సంపాయించగలడా" విచారం వ్యక్తం చేశారు కొందరు.

"పిచ్చివెధవ కాకపోతే ఇల్లు అమ్ముకుని అప్పులు తీర్చడం ఏమిటి! గవర్నమెంట్ ఉద్యోగం చేస్తున్నాడుగదా ఏ బ్యాంకులోనైనా అప్పు తీసుకుని తీర్చవలసిన బాకీలన్నీ తీర్చేసి నెలకింతని బాంకుకు చెల్లిస్తే సరిపోతుందిగదా! వడ్డీ తగ్గుతుంది. అప్పుల వాళ్ళబెడద తీరుతుంది. గుసగుసలాడుకున్నాయి కొన్ని అతి తెలివి బుర్రలు.

"ఇల్లు అమ్మితే మూడులక్షలు వస్తుంది కదా అప్పులన్నీ తీర్చేసి వూరుచివర్న చవకగా స్థలం కొనుక్కొని ఓ ఇల్లు కట్టుకుని హాయిగా కాలక్షేపం చెయ్యొచ్చు. అమ్మే వరకు వుసిగొలిపి అమ్మేక హేళన చేయాలని చూస్తున్నాయి కొన్ని విషపుర్రెలు.

మీ నాన్నగారు ఎంతో కష్టపడి కట్టించారీ



ఇల్లు. ఇపుడు కట్టించాలంటే మనవల్ల అయ్యే పని కాదు. మంచి సెంటర్లో వున్న ఇల్లు. అమ్మటం మంచిది కాదు. మరోసారి ఆలోచించుకో వెంకట్రావ్'' పక్కింటి ముసలాయన సహృదయతకు వెంకట్రావ్ చాలా సంతోషించాడు. కాని అతడు ప్రస్తుతం నిస్సహాయుడు.

ఇల్లు బేరం చేసిన శేటుగారు బంధువుల్ని

ఒకసారి, స్నేహితుల్ని ఒకసారి తీసుకువచ్చి ఇల్లు చూపించి సంబరపడిపోతున్నాడు.

ఇల్లు చూసిన శేటుగారు మనుషులు లోపల్లోపల శెట్టిగారి అదృష్టానికి అసూయపడతూ పైకి మాత్రం అదృష్టవంతుడివి అంటూ పొగిడేస్తున్నారు.

"పాపం పిచ్చిపంతులు పట్నంలో... అందులోను ఇంత పెద్ద సెంటర్లో ఇల్లు అమ్ముకుంటున్నాడు అప్పులు తీర్చటం కోసం. అప్పు దేని కోసం... తిండికోసం... అప్పులు చేసి తినడం అప్పులు తీర్చడానికి ఆస్తులు అమ్మడం వాళ్ళ పని అటువంటి వార్ని కనిపెట్టి అడిగినంత అప్పు ఇవ్వడం అప్పు వసూలంటూ ఆస్తులు స్వాధీనం చేసుకోడం మా వంతు" మనసులోనే తన తెలివి తేటలకు గర్వపడుతున్నాడు శేటు గారు. అంతే కాదు వెంకట్రావ్ అమాయకత్వానికి జాలి పడుతున్నాడు.

"అన్నయ్యా ఇల్లు అమ్మేస్తున్నావా. అమ్మా నాన్న నీకు మిగిల్చిన ఆస్తి అదొక్కటే. నాన్నగారు ఆ ఇంటిని ఎంత అపురూపంగా చూసుకున్నారో నీకు తెలీదా. ఏ మాత్రం డబ్బువచ్చినా ఇల్లు బాగు చేయించాలని ఆయన పడిన తాపత్రయం నీకు గుర్తులేదా! నీవుభార్యాబిడ్డల్తో ఆ ఇంట్లో వుండి సుఖ పడాలని ఆయన కన్న కలలన్నీ నాశనం చేస్తావా ఇలా ఇలా విష్టారంగా వ్రాసిన చెల్లెలి వుత్తరం చదివి మౌనంగా వుండిపోవటం తప్ప తన నిర్ణయాన్ని మార్చుకోలేదు వెంకట్రావ్.

మరో వారం రోజులయ్యాక అడ్వాన్సంటూ అరవై వేలు తీసుకువచ్చాడు శేటు మరో మధ్యవర్తిని వెంట పెట్టుకుని.

ఇల్లు తక్కువ ధరకు వస్తున్నది. ఆలస్యం అయిన కొద్ది గిట్టని వాళ్లెవరయినా బేరం చెడగొడతారని శేటుగారి భయం. అందుకే అడ్వాన్సు ఇచ్చి అగ్రిమెంటు వ్రాయించుకోవాలని తాపత్రయపడుతున్నాడు.

అడ్వాన్సు వద్దన్నాడు వెంకట్రావ్.

వెంకట్రావ్ అలా అవడంతో శేటుగారి భయం మరింత ఎక్కువయింది. ఇంకెవరైనా తన కంటే ఎక్కువ ధర ఇస్తామన్నారేమోనని అనుమానం వచ్చింది.

తనకు ఇవ్వవలసినపైకం మొత్తం ఒకేసారి ఇవ్వడం రిజిస్ట్రేషన్ చేయించుకోవడం ఒకేసారి జరగాలన్నాడు వెంకట్రావ్.

అంత పెద్ద మొత్తం తన దగ్గర సిద్ధంగా లేదనీ కొంత గడువు కావాలనీ అన్నాడు శేటు.

మరో నాలుగు నెలలక్కానీ అతనికి డబ్బు సర్దుబాటు కాదని అనుకున్న ప్రకారం తనకే ఇల్లు అమ్మేందుకు ఒప్పందంగా అడ్వాన్సు తీసుకోమన్నాడు శేటు.

"అడ్వాన్సు తీసుకోవడం ఆనవాయితీ" అన్నాడు మధ్యవర్తి.

అడ్వాన్సుగా అయిదు వందలు చాలనీ మిగిలిన మొత్తం రిజిస్ట్రేషన్ రోజున ఇవ్వమని చెప్పాడు వెంకట్రావ్.

అరవై వేలు నాలుగు నెలలకు అయ్యే వడ్డీని పైసల్తో సహా గుణించుకున్న శేటు పాపం వెంకట్రావ్ అని మనసులో సానుభూతి ప్రకటించాడు.

అడ్వాన్సు విషయంతోపాటు మరో

షరతు పెట్టాడు వెంకట్రావ్.

"డబ్బు చెల్లించడం రిజిస్ట్రేషన్ చేయించుకోవడం తప్ప ఆలోపుగా వ్రాత పూర్వకంగా ఎటువంటి ఒడంబడికలుండవు. అందుకు ఇష్టమయితేనే రంగంలోకి దిగడం" అని చెప్పాడు.

వెంకట్రావ్ మీదున్న నమ్మకంతో సరే అన్నాడు శేటు.

అయిదువందలు వెంట్రావ్ చేతికి ఇచ్చి మధ్యవర్తిగా వచ్చిన వ్యక్తికి మరోసారి ఇల్లు చూపించి వెళ్ళిపోయాడు శేటు.

ఇంతవరకూ జరిగిన కథంతా వెంకట్రావ్ నాకు వ్రాసిన ఉత్తరం ద్వారా తెలిసింది. ఉత్తరం చివర్లో నన్ను వెంటనే బయల్దేరి రమ్మని వ్రాసాడు.

ఆఫీసుకు మూడు రోజుల శెలవు పెట్టి బయల్దేరేన్నేను.

వెంకట్రావ్‌కు ఇల్లు అమ్మవలసినంత అవసరం ఏమిటో అర్థం కాలేదు నాకు. వాడికి అన్ని అప్పులు వున్నాయన్న విషయం నాకు ఎప్పుడూ చెప్పలేదు.

వెంకట్రావు నాకు పెద్దనాన్న కొడుకు. మా ఇద్దరి మధ్య బంధుత్వాన్ని మించిన స్నేహం వున్నది. రహస్యాలేవీ మా ఇద్దరి మధ్యా లేవు. అలాంటిది వాడి అప్పుల గురించి నాకు ఎప్పుడూ చెప్పకపోవటం ఆశ్చర్యంతో పాటు కోపాన్ని కూడా కలిగించింది నాకు.

ఇంట్లో అడుగుపెట్టగానే కన్పించాడు వెంకట్రావ్. వాడు కన్పించగానే మొదలు పెట్టాను తిట్టడం. ఇల్లు అమ్ముతున్నందుగ్గానూ తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టాను.

వాడి బాధలు, అనుభవాలు, అగచాట్లు చెప్పి వాటన్నింటినుంచీ విముక్తి పొందాలంటే ఇల్లు అమ్మటం ఒక్కటే శరణ్యాం అయిందని చెప్పాడు.

అప్పుడనిపించింది వాడి నిర్ణయం తెలివైందనీ సబబుగానే ఉందని.



వాడు ఇల్లు అమ్మటానికి అసలు కారణం ఎవరో, ఎందుకు ఈ నిర్ణయానికి రావలసి వచ్చిందో వాడికీ నాకు తప్పమరెవ్వరికీ తెలియదు.

మర్నాడు ఉదయం శేటుగారు వచ్చారు. చిరునవ్వుతో నన్నాయనకు ఆయన్ని నాకు పరిచయం చేశాడు వెంకట్రావ్.

తనకు అనుకోకుండా డబ్బు సర్దుబాటు అయిందనీ మరో వారం రోజుల్లో ముహూర్తం చూసుకుని ఇల్లు రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నట్లు చెప్పి వెళ్ళాడు శేటు

మరో నాలుగు రోజులు శెలవు పొడిగించాన్నేను వెంకట్రావ్ బలవంతంమీద.

వెంకట్రావ్ ఇంట్లో సామానంతా కొద్దికొద్దిగా ఆ వీధిలోనే వాడు అద్దెకు తీసుకున్న ఇంటికి తరలించాం.

చాలా వరకు సామానంతా తరలించేశాం. మిగిలిన కొంచెం మర్నాడు చేర్చవచ్చనుకుని ఇద్దరం సెకండ్ షో సినిమాకి వెళ్ళాం.

సినిమా నుంచి తిరిగి వస్తున్న మాకు వెంకట్రావ్ ఇంటిముందు లారీ కనిపించింది.

వెంకట్రావ్ ఇంట్లో అద్దెకుంటున్న ప్లీడర్‌గారి కుటుంబ సభ్యులు సామాన్లన్నీ లారీలోకి ఎక్కిస్తున్నారు. తెల్లవారే సరికి ప్లీడరుగారి వాటా పూచికపుల్ల కూడా లేకుండా ఖాళీ అయింది.

అది చూసిన వెంకట్రావ్ నన్ను కౌగిలించుకుని వెర్రిగా ఆనందంగా అరిచాడు వాడి సంతోషానికి అంతులేదు.

ప్లీడరు గారి పీడ వదిలించుకోవటానికే తాను ఈ నాటకం ఆడానని తనకు ఇంతకంటే మరో మార్గం కనిపించలేదని మంచిమాటల్తో శేటుగార్ని నొప్పించకుండా ఒప్పించాడు వెంకట్రావ్.

అద్దెల వాళ్ళతో బాధపడుతున్న శేటు గారు కూడా వెంకట్రావ్ బాధను అర్థం చేసుకోవటమే కాకుండా ఏదో సహాయం పొందినట్లు క్రొత్త ఆలోచన వచ్చినట్లు చూశాడు.

శేటుగారి సహృదయతకు మెచ్చుకున్నాను నేను కూడా. తనకి రావలసిన అయిదువందల రూపాయలు తీసుకొని వెళ్ళిపోయారు శేటుగారు.

పాపం వెంకట్రావ్‌కు నాలుగు సంవత్సరాల నుంచీ అద్దె చెల్లించటం లేదు ప్లీడరుగారు.

పైగా ఇల్లు ఖాళీ చేయను పొమ్మని మొండికేశాడు. ఏం చేయాలో అర్థం కాని పరిస్థితుల్లో వున్న వెంకట్రావ్‌కు మెరుపులా వచ్చిన ఆలోచనను వెంటనే అమలుపరిచాడు. ఇల్లు అమ్మకం పెట్టినట్లు నాటకం ఆడాడు.

ఎవరు ఎన్ని మాటలన్నా భరించి ఈ రహస్యాన్ని ఇంట్లోవారిక్కూడా చెప్పకుండా చివరి వరకూ ఓర్పుగా నేర్పుగా నాటకం ఆడిన వెంకట్రావ్ నిజంగా అభినందనీయుడు అనిపించింది నాకు.

ఏది ఏమైనా వాడి నాటకం సుఖాంతం అయినందుకు సంతోషించిన వారిలో నేనూ ఒకణ్ణి.

❀